# తీయని బాధ

"సుకుమార్"

[ఇందులో వచ్చేపాత్రలన్నీ కల్పితాలు]

ఒకానొక సుందరదృశ్యము, ఒకానొక దివ్యమంగళవిగ్రహము, ఒకానొకపిచ్చికల — తరువాత ఎన్నిసుందరదృశ్యాలు చూచినా, ఎన్ని దివ్య విగ్రహాలు కనపడ్డా, ఎన్ని వింతకలలు కన్నా, ఆ మొదటి దృశ్యమే, ఆ మొదటివిగ్రహమే, ఆ మొదటి పిచ్చికలే మరల మరల మనసులో అవతరిస్తూ ఉండడమే నిజమైన ప్రేమంటే — తీయనిబాధంటే.

*　　*　　*

నాకు నాలుగేళ్లప్పుడు మా అమ్మను గోదావరితల్లికి వప్పచెప్పి ఆరాత్రికి రాత్రే నది దాటి విఘ్నేశ్వరం వస్తున్నాము — రహదారిపడవలో. మాఘపౌర్ణిమ. వెన్నెలైనా, ఆకాశమంతా, ఎందుచేతనో, ఒక వింత ఊదారంగుతో నిండిఉంది. నక్షత్రాలు మెరిసిపోతున్నాయి. గాలి లేదు. సర్వమూ నిశ్శబ్దము. బొబ్బర్లంకలో సంపాదించిన ఊచబియ్యాన్ని రాల్చుకుంటూ పడవవాళ్లందరూ ఒకమూల కూర్చున్నారు — కిక్కురుమనకుండా. పడవనిండా జన మున్నా ఎవ్వరూ పలకడం లేదు. హాలులో దీపం మినుకుమినుకు మంటోంది.

అప్పుడు, లక్షకెరటాలమీద తేలిపోతూ ఉన్న చంద్రబింబంకేసి చూస్తూవున్న నా కళ్లఎదుట ఆకెరటాలమీద మాఅమ్మ కనబడింది:

తెల్లని జరీచీర, బంగారపు వడ్డాణము, చేతులకు వంకీలు, మెళ్లో కంటె, కాసుల పేరు, చెవులకు బావిలీలు, ముక్కున అడ్డబాస, చెంపలకు చేర్చి దువ్విన నల్లని తలకట్టు, ఒంపైన కొప్పు; పెద్ద అరకాసంత కుంకుమబొట్టు, కప్పవేసిన పలువరస కొంచెం కనపరుస్తూ చిరునవ్వుతో నన్ను చూచి "నాన్నా"! అని పిలచినట్టయింది. నేను "అమ్మ అదుగో!" అని కేకవేశాను. ప్రక్కనే ఉన్న మాచెల్లెలు బావురుమంది. అప్పుడు మాతాతయ్య మమ్మల్ని యిద్దరినీ తనసందిట్లోకి తీసికొని దుఃఖాన్ని దిగమింగుకుంటూ, "పిల్లలు జడుసుకుంటున్నారు" అని మామీద దుప్పటీ కప్పాడు......

ముప్పదియేండ్లక్రితంమాట అది. కాని, అప్పటికీ యిప్పటికీ యెంతటి అద్భుతమైన సృష్టివైచిత్ర్యాలని చూచినా అఖండగోదావరికెరటాలల్లో అవతరించిన దృశ్యము జ్ఞప్తికి రాకమానదు. శివసముద్రపు కావేరీధారల్లోనూ, బొంబాయి సముద్రపుషికార్లలోనూ, ప్రయాగవద్ద యమునానదీ నౌకావిహారాలల్లోనూ, హృషీకేశంలోని అతినిర్మలమైన గంగానదీఅగాధపు లోతులలోనూ, ఆ మొదటిదృశ్యమే కనబడుతుంది.

తాజ్‌మహల్ని చూచాను నాలుగైదుసార్లు. ఒకపర్యాయము మిక్కిలి ప్రేమించిన

ఒకవ్యక్తి నన్ను ఉద్దేశించే అభినయంతో "చేతులార శృంగారము" పాడుతూ,

"అందమైన నిన్ను యురమున జేర్చి"

అన్నచోట నన్ను గబుక్కున తనహృదయానికి చేర్చుకుంది! నేను ఆనందం భరింపలేక కళ్లు మూసుకున్నాను. మళ్లా ఆదృశ్యమే — అఖండగోదావరి, మా అమ్మ!

* * *

జీవితాదర్శమైన నా సౌందర్యరాశిని నేను మొదట చూచినప్పుడు స్తంభితుడనైపోయాను. నాకోరికమీదనే ఆమెను చూచాను — కాని ఏమి మాట్లాడను? రెండవ పర్యాయము కన్నెత్తి చూడ్డానికికూడా భయమేసింది. ఆమెమాత్రము నిర్భయంగా నన్ను పరిశీలించి చూచి నాలోతు కనిపెడుతో ఉన్నట్లు గ్రహించాను — ఆ మొదటి చూపు యిప్పటికీ మరవలేను...

తర్వాత అనేకవిషయాలు జరిగాయి — మంచీ చెడ్డా కూడాను. ఒక దివ్యనిమిషం ఆమె నా వొళ్లో తల పెట్టుకుని అనిర్వచనీయమైన ప్రేమదృక్కులతో నన్ను ముంచెత్తింది; "నేను నీకు తగను" అని అంటూ గద్గదికమై ఏడ్చింది.

చంద్రవంకను ప్రతిఫలింపజేస్తూ ఉన్న ఆమె కన్నీటిబొట్లను నేను పెదవులతో అతిభక్తితో తుడిచాను — ఆరుచి యిప్పటికీ యీ పెదవులను వదలలేదు —

ఆ దివ్యమంగళవిగ్రహాన్ని యిప్పటికీ ఆరాధిస్తున్నాను—

ఆమెకు మాత్రము నేను లేనేలేను!

మోమున మోముఁ జేర్చి నిను
ముద్దిడు కోరిక లేదు, నీదు వ
క్షోమృదుశయ్యపైని శిరసున్
గెడవాలిచి ప్రేలు మల్లికా
దామసువాసనా మధుర
త ల్పరికింపఁగఁ గాంక్ష లేదు, నా
ప్రేమకు దారిఁ జూపఁగ వ
రించితి........!

అన్న కవిహృదయంప్రకారము ప్రేమ పూర్తిగా అశరీర మైనదే.

* * *

తరువాత అనేక అనుభవా లొచ్చాయి యీ జీవితంలోకి.

అందాన్నే ప్రధానంగా చూచుకుంటూ గుజరాతులోను, కాశ్మీరంలోనూ, కలకత్తాలోను, మధురలోను, మలబారులోనూ, అనేకులను చూచాను - రూపసుల్ని. కొంతవరకు ఆకర్షించి యీ హృదయాన్ని వశం చేసుకున్నారు. కాని తృప్తి యెందుకుంటుంది? —

చివరకు ఒకానొక ప్రణయసంబంధానికి లొంగినా దానికికూడా కారణం ఆ మొదటి ఆదర్శంలోని ఏదో కళ ఒకటి ఈ వ్యక్తిలో కనబడడం వల్లనే — కాని మరల మరల ఎప్పటి ఆరాధనే; ఎప్పటి అన్వేషణే, ఎప్పటి దాహమే.

అయితే యిన్ని ప్రేమసంబంధాలను పెట్టుకోవడము ఏకాగ్రతకు లోపం కాదా, ఒకవిధమైన మానసికవ్యభిచారం కాదా అంటే:

ప్రేమ సంగీతంవంటిది. అనేకరాగాలతో కూడినది సంగీతం. నాకు సావేరిరాగం

చాలా యిష్టం. సావేరి వింటూఉంటే పరవశుడనైపోయి యేడ్చివేస్తాను. కాని భైరవి రాగమూ యిష్టమే. "జయ జయ గోకుల బాల..." వింటూఉంటే నా కళ్లముందర గోపాలకృష్ణుడు తాండవమాడుతాడు. "శివదీక్షాపరురాలను" వింటూఉంటే శివభక్తుడనైపోతాను. దీనివల్ల నాకు ఏకాగ్రత లేదనడం న్యాయమా ?

కళాపరిపూర్తికి యీరాగాలన్నీ తోడు కావాలి. యేమనోభావాని కనుగుణ్యంగా ఆరాగం కదలిస్తూ వుంటుంది. అన్నిటికంటె నన్ను ఎక్కువగా కదిలించేది సావేరి. కాని యితర రాగాలకుకూడా స్థానం ఉంది; గౌరవం వుంది.

భౌతికంలోకి దిగకుండా ఉన్నంతవరకు ఎందరిని ప్రేమిస్తే ఏమి ? ఎన్ని విగ్రహాలను ఆరాధిస్తే యేమి ? మానసికపూజకు కట్టుబాట్లేమిటి ?

ఈపూజ, యీగౌరవము, ఒకమెట్టు దిగి అన్యోన్యాభిలాషకోసం దేవుళ్లాడడం మొదలుపెట్టినప్పుడే వస్తుంది చిక్కు.

కాని సంస్కారమంటే మనఆశయాలని మన్నులో పడకుండా కాచుకోవడమే. ఇది కష్టం కావచ్చు. తెలియనివారికి అమానుషంగాకూడా ఉండవచ్చు. కాని మనలోఉన్న మృగత్వాన్ని నశింపజేసి దేవత్వం ప్రసాదించేదే నిజమైనప్రేమ.

* * *

అంటే యిందాకటికపికి భౌతికమైన ప్రేమఅన్నా స్పర్శన, చుంబన, ఆలింగనాది విలాసాలవిలువఅన్నా తెలియదనుకోకూడదు. అతనిజీవితంలో ఇవన్నీ అనుభవించే ఉండొచ్చు అతడు; ఒకప్పుడు వర్ణనాతీతమైన ఆనందాన్నికూడా పొందివుండవచ్చు వీనిద్వారా!

కాని కొంతసేపో, కొన్నినాళ్లో, కొన్నియేండ్లో, శరీరానికి ఉద్రేకం కలిగించి, రక్తాన్ని వేడిచేసి యింద్రియసౌఖ్యాల్ని యిచ్చిన యీవిలాసాలు అతనికి శాశ్వత మనిపించవు.

పైగా, అవి అతనిపరిణామంలో ఒకప్పుడు మిక్కిలి విలువకలవిగా కనబడబట్టే—

"మోమున మోముఁ జేర్చి
నిను ముద్దిడు కోరిక లేదు"

అంటాడు.

"...ప్రేలు మల్లి కాదామసువాననా
మధురత ల్వరికింపఁగఁ గాంక్ష లేదు—"

అంటాడు.

అవి ముఖ్యమైనా అతనికి ఆ "అప్రాప్త మనోహరి" తన "ప్రేమకు దారిచూపడమే" మరీముఖ్యము.

అయితే యిందులోకూడా ఒకలోపం వుంది:

నిజమైనప్రేమకు యింకొకరు దారి చూపడ మేమిటి? అప్రాప్తమనోహరి ఒకవేళ ప్రాప్తించినట్లయితే అతనిప్రేమకు దారి తెలిసినట్లా?

ఒకప్పుడు అట్టి విపత్తే జరిగితే అతని త్రోవకు నిరోధం కలుగుతుందికాని, ప్రేమ ప్రయాణము పైకి సాగదు. మనము కోరిన గగనకుసుమాలు మనచేతిలో పడితే అవి గగనకుసుమాలే కాకపోవచ్చును — ఎన్నెన్ని స్వర్ణవిగ్రహాలకు మంటికాళ్లు ఉండడం మనం చూడ్డంలేదు ?

ప్రేమకు దారి చూపమని ఆమెను కోరడం వెర్రి. ప్రేమకు దారి ఉండనేవుంది: ఏకాంతసేవ — దివ్యనామార్చన — ఎడబాటు భరింపలేనపుడు వేడినిట్టూర్పులూ— బాష్పసలిలధారలు. అయితే యివన్నీ కూడా కొంతతక్కువరకపు వికారాలనే చెప్పాలి.

మనోహారిణి ప్రాప్తించడం ఎందుకు? ఏనాడు నీవు నిర్మలహృదయంతో ఆమెను నీప్రణయరాణిగా చేసుకున్నావో ఆనాడే నీకామె లభించింది! నిజమైనప్రేమకు అవతలవారి అంగీకారంకాని సహాయంకాని అవసరమే లేదు. అవి వుంటే ప్రేమ పరిపూర్తి చెందుతుం దని కొందరి మతము — కాని అవి లేకుండానే నానాటి కతిశయిల్లి గొప్పదయ్యే ప్రేమే నిజమైనప్రేమ.

* * *

అయితే జనసామాన్యానికి మాత్రం పెద్దపెద్ద ఆశయాలు పొసగవు. శారీరకమైన విలాసాలూ, తద్ద్వారా ఆనందమూ, వివాహం, సంసారం, సంసార తాపత్రయాలూ - యివన్నీ జరగవలసినవే.

సంసారంలో ప్రేమ లేదనకూడదు. అద్భుతమైన ప్రేమ ఉండడానికి అవకాశాలున్నాయి. కాని యీ అవకాశాలు యిప్పటిపరిస్థితులలో రాణింపవు.

నిజంగా భార్యాభర్తల స్నేహంకంటె గొప్పస్నేహం లేదనవచ్చు. ఎంత అన్యోన్యప్రేమ ఉన్నా, ఎంత త్యాగసంపత్తి ఉన్నా, ఎంతటి సమాన ఆశయాలు ఉన్నా, ఏ మిత్రద్వయమున్నూ అదృష్టవంతులైన దంపతుల అన్యోన్యానికి సాటి కారు.

కాని యిప్పుడు దేశంలో అమలులోనున్న వివాహాలలో అట్టి అన్యోన్యానికి వీలేదీ?

ఆమెకు పన్నెండేళ్లు — శారదాబిల్లు పుణ్యమా అని పద్నాలుగేళ్లుండొచ్చు; అతనికి ఏపదహారో పద్దెనిమిదో ఏళ్లుంటాయి. వీరి మనసుల్లో ఏమి భావాలుంటాయి?

తల్లిదండ్రులచాటున పెరిగేపిల్లఅయితే, ఆమెకు అప్పుడే భర్తను భక్తితోను, భయంతోను చూడ్డం, భర్త కోరినప్పుడు తన శరీరాన్ని అతని కర్పించడమూ, అతను సంపాదించి తెస్తూఉంటే ఆమె వండిపెడుతూ ఉండడమూ, క్రమేణా పిల్లల్ని కనడమూ, వాళ్లని పెద్దవాళ్లను చేసి పెళ్లిళ్లు చేయడమూ, ఆస్తి, నగలు, భూమి నిలువచేసి నలుగురిలోనూ గౌరవంగా మసలడమూ- ఇవీ ఆమె కోరికలు.

ఇక అతనివిషయం. పెండ్లి అయేసరికి అతను ఏ టెన్నిసుఆటల్లోనో, సినిమాధోరణిలోనో, "బుద్ధిమంతుడైతే" పరీక్షావిషయాల్లోనో నిమగ్నుడై ఉంటాడు. సహచరుల ధర్మమా అని యిదివరకే సంసారసుఖములంటే ఒకవిధమైన భావముంటుంది అతని మనస్సులో.

దీనితో ప్రథమసమాగపువేళ మోటుగా ప్రవర్తించి ఆమెను బెదిరించివేసో, బొత్తిగా రాయిలా ఉండి ఆమెకు విసువుగలిగించో, యీ జన్మానికంతా ఆమెకు తన మీద అసహ్యం కలిగించుకుంటాడు; లేదా యిది మనవిధ్యుక్తధర్మంకాబట్టి జరిగిపోవాలని, యీసంసారచక్రంలో వారిద్దరూ బండికళ్లై తిరిగిపోవడం ఆరంభిస్తారు.

* * *

ఒకరిమనస్సులు ఒకరు అర్థంచేసుకుని, ఒకరిఆశయాలకు ఒకరు దోహదంచేస్తూ అభివృద్ధిఅయ్యే ఐక్యాలు యెన్నివున్నాయి మనలో? లేనేలేవేమో!

అనేకులు భర్తలు తమభార్యలవిలువ తెలియకుండా ఉన్నవాళ్లని నేనెరుగుదును. అనేకులు భర్తలు తమభార్యలు దేదీప్యమానమైన అందంగలవారని ఎరగరు — వారికి ఆధోరణే లేదు. అనేకులు భర్తలు తమభార్యలకు అద్భుతమైన సంగీతజ్ఞానముందని ఎరుగనే ఎరుగరు!

* * *

ఒకనాడు మేము కొండపల్లెకు వెళ్లాలని ప్రయాణమయ్యాము. మాఅక్కయ్య అంది: "మాస్నేహితురాలుంది తీసుకువస్తాను" అని.

అలవాటుచొప్పున నేనన్నాను: "ఆమె అందంగా ఉంటుందా" అని. "నువ్వున్నావుగా మహా నవమన్మథుడిలాగ" అంటూ నన్ను స్టెతస్కోపుతో కొట్టి వారివీథికి కారు మళ్లించింది.

మేము రావడం కిటికీలోంచే చూచి కిటికీతలుపులు దబాలున వేసి ఆమె అంతర్థానం అయిపోయింది. కాని నాదొంగకళ్లకు ఆమె దివ్యమైన దేహకాంతీ, తీవ్రదృష్టిగల విశాలనేత్రాలూ, సాక్షాత్తూ సంపెంగపువ్వును అనుకరించే నాసికా నిజంగా ఎర్రని నాజూకైన పెదవులూ కనబడ్డాయి — "అక్కయ్యా ఆమెను ఎల్లాగేనా తీసుకురావాలి" అన్నాను.

ఆమె వచ్చింది. ఆమెను నాప్రక్కన కూర్చోపెడుతుందేమో మాఅక్కయ్య అనుకున్నాను. కాని వారిద్దరూ కలిసి వెనుక కూర్చున్నారు. — నాకామెను పరిచయమేనా చేయలేదు. కాని ఆమె ఏడేండ్లకుమార్తె — అచ్చంగా తల్లిపోలిక — "కారుమామయ్యా" అంటూ నా ఒళ్లోకి ప్రాకింది. "ఊరుకో కనకం" అంది ఆవిడ. నేను కనకాన్ని మరీ దగ్గరకు తీసుకున్నాను.

నాముందు అద్దం ఉండబట్టి సరిపోయింది కాని లేకపోతే ఆనాటిప్రయాణము ఎల్లా నడిచేదో తెలియదు. ఒకటి రెండుపర్యాయాలు అద్దంలో ఉన్న నామొఖంకేసి ఆమె తదేకదృష్టితో చూడ్డం కనిపెట్టాను. ఆమె తల వొంచుకుంది. మమ్మల్నిద్దరినీ పట్టుకుంది మాఅక్కయ్య!

త్రోవపొడుగునా వారేదో మాట్లాడుతున్నారు. ఆవూళ్లో ఆడవాళ్లక్లబ్బులు, క్లబ్బుకీమె వెళ్లకపోవడమూ, ఎంతవెళ్లాలని ఉన్నా యింట్లో తెమలకపోవడమూ, యీ వూరొచ్చాక ఒక్కసినీమాఅయినా ఎరక్కపోవడం, వారిపుట్టిల్లు విశాఖపట్టణపుసాంపూ, వాల్తేరులో సముద్రపుటొడ్డున వారి బంగాళా, సింహాచలం అందం, ఆసంపెంగతోటలూ, గులాబీవనాల్లో, అత్తవారింటికి వచ్చేదాకా అన్నదమ్ములతోనూ వదినెలతోనూ ఆమె విహారంచెయ్యడం ఆమె చెపుతోంది ఉత్సాహంతో.

ఎందుకన్నానో నేను: "నేనుకూడా వెళ్లానండి సింహాచలం చాలాసార్లు. అద్భుతంగా ఉంటుంది. ఆపోకచెట్లపక్కని చిన్న బోదె వుంది. ఆబోదెచుట్టూ మెట్టతామర గింజల్ని యేరి దండలుగా గుచ్చేవాళ్లం" అన్నాను.

అప్పు డంది మా అక్కయ్య "సత్యవతీ! వీడు మాతమ్ముడు 'సుకుమార్'. చాలా కొంటెవాడు" అని. ఆమె నవ్వినట్టు చూశాను......

మా అక్కయ్యకు "బాటనీ" (వృక్ష శాస్త్రం) అంటే చాలాయిష్టం. కొండమీదికి వెళ్లాక తాను తెచ్చిన తడివట్టివేళ్ల సంచీలో రకరకాల మొక్కల్నీ, పువ్వుల్నీ యేరి నింపుతోంది కనకంసహాయంతో. "మీరు పదండి వస్తాము" అంది మాతో. తప్పనిసరిగా మే మిద్దరమూ పక్కపక్కన నడవడం ఆరంభించాము. తీగలా ఊగిపోతూఉన్న ఆమె విగ్రహంనుంచి కళ్లు మరల్చుకోవడం నాకు దుస్సాధ్యమైంది.

పడమటికనుమ చేరాం. సూర్యుడు అప్పుడే యింటిముఖ మయ్యాడు. దట్టంగా కమ్మిన నీలమేఘాలసందునుంచి కిరణాలు దూరాన్నున్న కృష్ణపాయలను వెండిసెల యేళ్లుగా చేసేస్తున్నాయి. మాముందు ఆమడలపర్యంతం దట్టమయిన పచ్చనిఅడవి. నది అవతలివొడ్డున కొండలు. బహురమ్యంగా ఉంది.

ఆమె అటు తేరి చూచి ఉత్సాహంతో "అదుగో వేదాద్రి! అదుగో అమరావతి" అన్నది.

"మీకు అమరావతి తెలుసునా?" అన్నాను.

"తెలియకేం? — అక్కడ ఒకప్పుడు బౌద్ధ స్తూపం ఉండేది ... నేను సారనాథ్ కూడా చూశాను......ఆబూపర్వతంలోని జైనదేవాలయాలూ చూశాను."

"ఇంకా?"

"ఇంకా చాలాచోట్లు చూశాను — కాని—"

"కాని?"

"ఏమిలాభము? — అదోపూర్వజన్మ!"

నాకు ఆశ్చర్యంవేసింది. నేనుతప్ప నా కారులో యింత భూప్రదక్షిణంచేసినవాళ్లు లేరని నాగర్వం.

"చెప్పండి — నాకు వినాలని ఉంది" అన్నాను ఆత్రుతతో.

"దిల్వారాలో ఆ అద్భుతశిల్పాలని చూచి — చనిపోవా లనిపించింది."

"ఎంతమాట!"

"అవును — అంతటి సుందరమైన విషయాలను చూశాక యింక జీవించడ మెందుకు?"

నాకు మరీఆశ్చర్యమైంది — ఒకానొకప్పుడు హంపీక్షేత్రంలో విరూపాక్షాలయం దగ్గర ఒకమందిరంలో మహావలయాకృతిని రాసక్రీడ చిత్రించి ఉండడం చూచాను. కృష్ణకర్ణామృతములోని

శ్లో. అంగనా మంగనా మంతరే మాధవో
మాధవం మాధవం చాంతరే చాంగనా,
ఇత్థమాకల్పితే మండలే మధ్యగ
స్సంజగౌ వేణునా దేవకీనందనః.

అన్న వర్ణన ననుకరించి అద్భుతంగా చెక్కబడివుంది రాసక్రీడ. దానిని చూచి నేను స్నేహితునితో అన్నాను: "అబ్బా! ఏమి అందం! చచ్చిపోవాలని ఉందోయి" అని.

మరల యిన్నేళ్ళకు అదే భావము — అద్భుతమైన అందాన్ని చూచి అంతటితో అంతమైపోవాలని వెర్రిఉద్రేకం — మరల యీనాటికి యీమెవల్ల విన్నాను.

ఆమె మాటలు యింకా వినాలని అనిపించింది. ఒకవేళ పాడగలదేమో ?

"మీకు సంగీతము యిష్టమా ?"

ఆమె ఒకక్షణం ఆలోచించి "యిష్టమే — కాని పాడి కొన్నేళ్ళయింది."

"ఏం — యిప్పుడు మానివేశారా ?" మౌనము.

"ఈ దివ్యసమయములో కొంచెము పాడాలని లేదా ?" ఆమె నాకేసి చూడలేదు. మరల అడిగాను : "పాడరా — నే నడుగుతున్నాను కాబట్టి..." (ఏమిచొరవ!)

ఏమి ఆచూపు! జాలిపడుతూ, జాలి చూపిస్తూ, జాలికోరుతూ, జాలిని కలిగిస్తూ నన్ను చకితుణ్ణి చేసింది......ఆమె పెదవులు కదిలాయి :

"ఏమి పాడను ?"

"ఏదయినా సరే — మీ యిష్టం వచ్చిన పాట."

నేను కళ్లు మూసుకున్నాను...

తేనెసోనలు చింద నారభించినాయి :

"క్షీరసాగర శయనా — నను
చింతల బెట్టవలెనా......"

ఎంతసేపు పాడిందో ఆమె...... ఆప్రశాంతసమయంలో దేవతలు విహరించే వేళ, ఎంత స్వానుభవంతో ఎంత దీనంగా, ఎంత మధురంగా, ఎంత జాలిగా ఆలాపించిందో ఆమె నేను చెప్పలేను......

మాఅక్కయ్య యెప్పుడో వచ్చి మా కాళ్లమీదికి క్రుంగివున్న నాతలను తన మెత్తనిచేతులతో నిమురుతూ "ఏమి టిది" అని నాకన్నీటిని చూచింది.

కనకం తల్లిఒళ్లో చేరి "అమ్మా! ఎందుకే ఏడుస్తున్నావు?" అన్నది.

మాఅక్కయ్య దొంగకోపంతో "చాల్లెండి — "సెంటిమెంటల్ ఫూల్సు!" పదండి చీకటిపడుతోంది" అని ఆమెను బహు నెమ్మదిగా లేవదీసింది. కౌగలించుకుంది.

సూర్యుడు ఎర్రబారిన మొగంతో, "వెళ్లిపోతున్నారా? నేనూ వెడుతున్నాను" అన్నట్టు వేదాద్రివంకకు మరిగాడు — మేము యిళ్లకు చేరుకున్నాము.

ఆరాత్రి ఆమెభర్త — వాసుదేవరావు ఆమెను కొట్టాట్ట !

* * *

తరవాత చెప్పింది మాఅక్కయ్య : వాసుదేవరావుగారు భార్య పోగా మరదల్ని సత్యవతిని పెళ్లాడాడనీ, సత్యవతి తండ్రి సర్వే యిలాకాలో గొప్ప ఉద్యోగం చేసి పింఛను పుచ్చుకొని, విశాఖపట్టణంలో కాపురముండేవాడనీ — కాలక్రమేణ కలకత్తా గుర్రపుపందాలలో ఆమె అన్నగారి ఆస్తి అంతా చాలవరకు పోయిందనీ, తండ్రి గతించాక సత్యవతికి ఈ అనుకోనిపెళ్లీ, అతను చాలా మంచివాడైనా ఒంటెత్తుగుణం కలవాడనీ, ఎప్పుడూ తనవంతెనలూ, రోడ్లూ, కంట్రాక్టరులే తప్ప వేరే వ్యాపకం లేనివాడనీ, దేశదేశాలలో మహాకీవితో వెలిగిన

ఆమెతండ్రిద్వారా ఆమెకి కలిగినవిద్య, కళా వ్యాపకము, అన్నీ బూడిదలో పోసినపన్నీరయినాయనీ, అతనికి రూపవతిన్నీ, తనకంటె ఎక్కువసంస్కారీ అయిన భార్యఅంటే తగని అనుమానమనీ, ఆమె ఎవరితోనైనా, ఆడవారితోగాని, మగవారితోగాని మసలితే పట్టలేనంత ఈర్ష్య కోపము వస్తుందనీ, ఆమె కనకంమీద పంచప్రాణాలూ పెట్టుకొని ఎల్లాగో కాలం గడుపుతోందనీ యింకా ఏవేవో చెప్పింది మాఅక్కయ్య.

ఆరాత్రి నాకు నిద్దుర లేదు. రెక్కల మీద ఆమెవద్దకు వెళ్లి ఆమె రెండుచేతులూ పట్టుకొని "అమ్మా! విచారపడవద్దు. నేనున్నాను మిమ్మల్ని పూర్తిగా అర్థం చేసుకోగలవాణ్ణి. మీలాగే బాధపడుతూ ఉన్నవాణ్ణి. మీలో ఉన్న నిరాశనూ, నిరుపేదరికాన్ని నేనూ అనుభవించాను. అనుభవలోకంలో మన మిద్దరమూ సహచరులము, స్నేహితులం" అని ఊరడించాలని ఎంతో అనుకున్నాను! కాని, ఏమిలాభము? ఆశలు గుర్రాలైతే, బిచ్చగాళ్లు రౌతులౌతారు!

మాయిద్దరి మధ్యా సంఘనియమాలనే మహాకందకం ఉంది......

నాటికీ నేటికీ నేను మళ్లా ఆమెను చూడలేదు...కనకం పుట్టినరోజుకుమాత్రం నాకు "కారుమామయ్యకు" అని పట్టు జేబురుమాలు వస్తూవుంటుంది. దరిమిలాను "కారుమామయ్య" సుకుమార్ అయ్యాడు. ప్రతి శ్రావణశుద్ధపంచమికి సత్యవతీదేవి కుట్టిన సువర్ణాక్షరాలతో నేను ఎక్కడ వుంటే అక్కడికి పట్టురుమాలు కానుకగా వస్తూ వుంటుంది — నా తడికళ్లను అద్దుకోడానికి.

జవాబు వ్రాయాలని ప్రయత్నిస్తాను. "కొంప మునుగుతుంది సుమా" అంటుంది మా అక్కయ్య — ఆమెకు సంఘపు మొట్టికాయలబాధ తెలుసును కాబట్టి.

సంఘమే కాదు. ఈర్ష్యాపిశాచం కూడాను. "అమ్మపెట్టదు. అడుక్కు తిననీయదు" అన్నట్టు తా నామెకు ఆనందం యియ్యడు. యిచ్చే త్రోవలను నిరోధిస్తాడు. — భార్య అతనికి విలువగల ఒకవస్తువైందిగాని, ఆమె గౌరవానికి, తన స్నేహానికి, తన అనురాగానికి, ఒకొక్కప్పుడు తన భక్తికి నిలయమైన తేజస్స్వరూపిణి అని గుర్తెరగడు. సుమకారంతో చూచుకుంటూ ఉన్న మడిమాన్యాలలో ఆమెకూడా ఒకర్తె. తనతోటలోని గులాబిపువ్వులను యితరులు తేరిపారజూస్తే కర్రపుచ్చుకునే తోటమాలిలాగ యితనున్నా ఎవరైనా తనభార్యలావణ్యాన్ని కన్నెత్తి చూచినా, ఆమె మృదుల సంభాషణవల్ల కొంత మనశ్శాంతిని పొందినా యితనికి కిట్టదు.

యిక వీరిద్దరిమధ్యా స్నేహం ఎల్లా కుదురుతుంది? పాపం అక్కడికీ ఆమె అనేక విధాల అతనివ్యాపకాలలో జోక్యం కలిగించుకొని అతను యింటికి వచ్చాక తిని కూర్చుని తమలపాకులను అందుకుంటూఉన్నప్పుడు మెల్లిగా అడుగుతుంది, 'ఈవేళ ఆఫీసులో జరిగిన విషయాలు ఏమి'టని. అతనికి చెప్పటానికి ఓపికేది? అడిగించుకోవాలనీ, కనకంసంగతీ, కనకం ఎదుగుతో ఉన్న విషయం, కనకం చిన్నిహృదయంలోంచి

మొలకలెత్తుతూన్న చిన్నారిభావాలూ, ఆమె అల్లరీ, అప్పుడే సంగీతంలో ఆమెచూపిస్తూ ఉన్న శ్రద్ధ, స్థానంపాటలను అచ్చంగా స్థానంలాగే పాడడం యివన్నీ అతనితో చెప్పాలని ఉంటుంది ఆమెకు. కాని అతనికి తీరికేది ? ప్రక్కయింటికి కబురు పంపించి తెప్పించిన అర్థణాపేపరులో జమ్మలమడుగు వృత్తాంతాలని చదువుతూ నిద్దర వచ్చే అతనికి ఈమెతో సల్లాపమే అక్కరలేదు. ……గుర్రుపట్టి నిద్రపోతాడు. ఆమె ఒక సారి పక్కదగ్గిరికి వెళ్లి కనకాన్ని తడిమి చూచుకొని కింద పడుతుందేమోనని ఈ వైపూ ఆవైపూ తలగడలను సరిచేసి వచ్చి పడుకుంటుంది. కాని, నిద్రవస్తేగా! మళ్లా లేచి వెళ్లి చల్లగాలిలో కొంచెం హాయి అనుభవించి పడకటింటిమూలను భద్రపరచిన వీణను తీసికొని శ్రుతులు సరిచేసుకొని యిష్టంవచ్చిన వర్ణమో, ఏదో పదమో పలికిస్తూ వీణతో చెప్పుకుంటుంది తనభగ్నహృదయపుగాథను………

ఒకవేళ సుకుమారు ఆమెకళ్లకు కనుపడతాడేమో !……

*　　*　　*

భార్య తన స్వార్జితమైన చరాస్తీ, నిజంగా స్థిరాస్తీకూడాను అని అనుకుంటూన్న భర్తలేకాదు; అదేవిధంగా భర్తకూడా తమ ఆస్తి అనుకొనే భార్యలూ ఉన్నారు. వీరి విషయంలో సాధారణంగా ఈభావము ప్రేమోద్రేకంవల్ల వచ్చిందేమో? ఆర్థికంగా మాత్రం కాదు. మొట్టమొదటి చనువులను పూతగా తీసికొని వీరు భర్తను తమ అనుచరుణ్ణిగా చేసుకుంటూరు. ఆమెమీద అపరిమితమైన ప్రేమవల్లో, సహజంగా యితనిలో వున్న స్త్రీజనమందలి గౌరవంవల్లో యితడు ఆమెను చాలచాల పెద్దచేసి అన్ని విధాలా ఆమెకు సంతోషం కలిగించాలనే చూస్తుంటాడు. ఏమి చేసినా ఆమెను కనుక్కోందే చేయడు. ఏ ఆనందం అనుభవించినా ఆమెతోపాటే అనుభవిస్తాడు……

కాని ఏముహూర్తాన వస్తుందో శాంతినికేతనంనుంచి బెంగుళూరు వెడుతూ పూర్వపరిచయంవల్ల బెంగాలీ అమ్మాయి రేణుక వీరింట్లోనే దిగాలా ? రేణుక మన పార్వతికంటె ఎక్కువ అందంగా ఎందుకుండాలి ? పార్వతికంటె వేష భాషలలో ఎక్కువ నాజూకుగా ఉండడం రేణుక తప్పా? పూర్వం కొన్నియేండ్లు తనతో సహాధ్యాయుడై ఉన్న మోహన్‌తో ఆమె చనువుగా ఉండడం ఆమెకు తప్పులా కనపడదు. అతను సోఫాలో కూచుంటే దబ్బున వెళ్లి అతని పక్కనే కూచుంటుంది. అతను లేచి వెళ్లి యింకో కుర్చీలో కూచుంటే ఏం బాగుంటుంది? వారిద్దరిమధ్యా తాను కూర్చోవాలని ఎన్నిసార్లు ప్రయత్నం చేస్తుంది పార్వతి ?

“ ఈమధ్య వసంతోత్సవం చేశాము బోల్పూరులో. గురుదేవుడు నా నృత్యాన్ని చూచి ఆనందమయుడయాడు. ‘బిడ్డా! ధన్యురాలవు’ అని కౌగలించుకున్నాడు” అంటుంది రేణుక.

ఆమెను నిదానించి చూచి, నృత్యము కోసమే సృష్టింపబడ్డ ఆమె అంగసౌష్ఠవానికి ఒక్క నిమిషము అతడు సంతోషించటమూ, ఆపొగడ్త అతని చూపులలో ప్రసరించడమూ పార్వతికి ఎల్లా కిడుతుంది ?

సాయంత్రము బీచ్‌కి వెళ్లాలని ముగ్గురూ బయలుదేరతారు. కారులో ఎక్కబోతూఉంటే కలెక్టరుగారిభార్య వచ్చి "పార్వతీ" అంటుంది. కలెక్టరుగారిభార్య కొంచెం పూర్వాచారం కలది. మోహన్‌తో మాట్లాడదు. పార్వతి వెనక్కుండిపోతుంది. వారు వెళ్లాలా, వద్దా?—పోనీ, ఆమె నిలబడిపోయిందని వారూ ఆగరాదూ? రేణుక రోజు రోజూ వస్తుందా? మళ్లా ఎన్నాళ్లకొస్తుందో యీవూరు? కలకత్తా ఆవేపున సముద్రం ఉండదు. మోహను భారమంతా డ్రైవరుమీద వేసి ఊరకుంటాడు. క్రొత్త దృశ్యాలని చూడాలని ఉన్న రేణుక ఉత్సాహం డ్రైవరుని కమ్మివేసి పార్వతి లేకుండానే బీచిప్రయాణం సాగుతుంది. ఎంత మంచి మోటారైనా ఏదో మర పాడవడం ఆశ్చర్యమా? రాకరాక వచ్చిన అతిథికోసం పార్వతి మరోగంట ఎక్కువసేపు భోంచెయ్యకుండా కనిపెట్టుకోవడంలో అంత గొప్పయిబ్బంది లేదు. కాని కలెక్టరుగారిభార్య పుణ్యమా అని రేణుక "తెయితక్కలబొమ్మ"యింది. దానికోసం కనిపెట్టుకోవడం కంటకమయిపోయింది పార్వతికి.

వా రిద్దరూ ఉత్సాహంతో మేడమెక్కి రావడం వింది. వారు హాలులోకొచ్చేసరికి పార్వతికి తలనొప్పి వస్తుంది.

"అయ్యో ! యింతసేపూ యింట్లోనే ఉన్నారా? చల్లగాలి లేకపోతే తలనొప్పి రాదూ? యీకిటికీ తీయనా" అంటుంది రేణుక.

"వద్దండీ ! చలేస్తోంది — మీ రెళ్లి భోంచెయ్యండి" అంటుంది పార్వతి.

మోహనరా వేంచేస్తాడు? 'అమృతాంజనం పట్టుకొచ్చి రాయనా' అంటాడు. ఆమెకు కావలసింది ఈ అంజనం కాదు!

"ఏమీ వద్దు. మీ రిద్దరూ వెళ్లి భోంచెయ్యండి. పరమాన్నం చల్లారిపోయిందప్పుడే" అంటూ అతనికేసి చూడనయినా చూడదు. ఎప్పుడో మధ్యాహ్నం తాగిన కాఫీ — యింక ఆమెను మరీబతిమాలలేక వా రిద్దరూ భోజనానికి వెడతారు.

రోజూ అయిదు నిమిషాలలో భోంచేసి చెయ్యి కడుక్కునే మోహన్ అరగంట ఎందు కుండాలి భోజనందగ్గర? ప్రతివస్తువు మారు వడ్డించుకుంటున్నాడు. ఆమెకు మన వంటకా లన్నీ వర్ణించి చెపుతూ యింకా యింకా రుచిచూడమని బలవంతం చేస్తున్నాడు !—

పార్వతి తన తలనొప్పిమాట మరచిపోయి రోజుకుంటూ వచ్చి "అవ్వగారూ! పెరుగెక్కడుందండీ" అంటూ వెండిగిన్నెలో పెరుగు తీసికొని వారిని కనుక్కోకుండానే దబదబా వారిద్దరికీ వడ్డించి మెఱుపులాగ మళ్లీ పడకటింటిలోకి వచ్చేస్తుంది.

—వారిద్దరికీ తమలపాకుల్ని పంపిస్తుంది. మోహన్ వినేటట్టుగా "సుబ్బారావూ! డ్రైవరుని కారు తెమ్మను. అమ్మగారు రైలు కెళ్లాలి ?" అంటుంది.

పాపము! రేణుక యింకా నాలుగైదు రోజు లుంటుందేమో, ఆమెవల్ల పార్వతి యింకా క్రొత్తవిషయాలను తెలుసుకుంటుందేమో, ఈవూళ్లో కొందరికైనా వంగదేశపు కళంటే ఏమిటో, వారు మనకంటె ఎందుచేత గొప్పవారయారో చూపించాలని అనుకున్న

మోహను యిప్పుడు ఆమె ప్రయాణాన్ని ఎల్లా ఆపగలడు? రేణుకకూడా తన ప్రోగ్రాం ప్రకారము మోహానువద్ద నాలుగైదు రోజు లుందామని వచ్చినా యింకమీాదట ఎల్లా వుంటుంది?

......రైలు కదులుతూండగా అతని చేతుల్ని తనచేతుల్లోకి తీసుకుని రేణుక అంటుంది;

"నాకు తెలుసు...విచారించకు...... కాని, ఆమె సౌఖ్యాన్నే నీ సౌఖ్యంగా చూచుకో."...

పార్వతీ మోహానులమధ్య అంకురించిన ఈ చిన్నగాలి ఈదరగాలై, హోరుగాలై, తుపానై, ఉప్పెనై, ప్రళయమై, వారిని శాశ్వతంగా విడదీసివేసింది. ఎవరిది తప్పు?

తప్పెవరి దైతే నేమి? వీరిద్దరూ వొకరి నొకరు అర్థం చేసుకోడానికి ప్రయత్నించక పోవడమే విచారకరం. ఆపేక్ష, అనురాగమూ వేరు, — ప్రేమ వేరు. ప్రేమలో స్నేహం వుంది. ప్రేమలో స్వార్థం యిసుమంతైనా లేదు. త్యాగస్వరూపమే ప్రేమ!

*　　*　　*

నీప్రియురాలిని చేతులార లోకప్రియురాలిని చేయగలిగినపుడే ధన్యుడవు!

"నీవెత హారింతు — సుఖమెల్ల
నీకెయుంతు"

అన్నప్రియుడే గొప్పప్రియుడు.

యింతకూ నిజమైన ప్రేమ యేమిటంటే: భౌతికంకాని అశరీరమైన ఆశయారాధన.

మనం మిక్కిలి హృదయపూర్వకంగా ఆరాధిస్తూవున్న ఆశయాలు, మన నిజమైన అనుభవాలపరిపూర్తి, మనము పైకి చెప్పడానికికూడా భయపడే గొప్పకోరికలు అన్నీ మూర్తీభవించి ఒకదివ్యమంగళవిగ్రహంలో "సగుణబ్రహ్మ"గా అవతరిస్తూఉంటాయి.

కాని, మన అజ్ఞానంవల్ల ఒకొక్కప్పుడు వీనిని భూలోకానికి దిగలాగచూస్తాము — అప్పుడు అంటాడు కవి:

......"ఔర! ప్రభాతశైలసా
నూపలనీలపాళికల
నొత్తకయే స్రవియించు ఆహిమా
నీపరగాయనీగళవి
నిస్రుతమాధురి మంటి కీడ్తురా?

అని.

ఉత్తమకవి ఆదర్శప్రియుని - దృష్టిలో:

"ప్రేయసి సోయగమ్మునకు
లేదు శరీరము; లేదు మేను నా
తీయని ప్రేమకేని; కలదే
యెడంబాటేక మాకు!"......

కాని, కొన్నికొన్ని గొప్ప ఉద్దేశాలను మనసులో జపించుకోవడం ఒకటి. వానిని అనుభవాలుగా చేసుకోవడం వకటి. ఒకొక్కమారు మన ఆశయాలు చాల దగ్గరగా అందుబాటులో ఉన్నట్టుంటాయి. ఎన్నాళ్లనుంచో మనసులో చిత్రించుకున్న గుణపరంపరల నన్నిటినీ, ఎన్నాళ్లనుంచో హృదయంలో ఆరాధిస్తూఉన్న విలాసాలను అన్నిటినీ ఆఖరికి ఒక వ్యక్తిలో చూచా మనుకుంటాము. అన్వేషణ పూర్తి అయిం దనుకుంటాము. కాని చివరికి ఏదో లోపం వుంటుంది.

ఎంతటి స్వర్ణవిగ్రహానికైనా, కాలిగోరికైనా మన్ను తగిలి వుంటుంది. అప్పుడే వస్తుంది ఆశాభంగము, భరింపరాని ఆశయభంగము! ఆ స్థితిలోనే అంటాడు కవి:

"ఏ మృగతృష్ణనో వలచి యేడ్చెదు; నీ దురదృష్టజీవిత
ప్రేమము నీయెడంద కొన రెక్కలకేనియు నందరాని స్వ
ర్గామృత నందనప్రసవ మయ్యెఁగదా! వెదకాడఁబోయె దే
లా మిహికా మృషా పథములం దని రందరు నవ్వులాడుచున్."

---

# సాంత్వనము

కొండూరు వీరరాఘవాచార్యులు

తావు లెగజిమ్ము నాపొన్నతరువుక్రింద
పాలగచ్చుటరుంగుపైఁ బవ్వళించి,
ప్రణయరాగాలు దీయు నో పడుచుపిల్ల
ఏల శయనించినావు రానేలమీఁద ?

జిలుగుచిఱునవ్వువెన్నెల ల్చిందిపడెడి
వదనమున కోపపూర్ణవైవర్ణ్య మేల
తాండవించెడు? భామినీ! తలపవొక్క,
తమము వర్షింపఁబోఁడు సుధామరీచి.

చిరవియోగార్తి ఖిన్నమౌ చిత్తసీమ
వలపుఁదేనియ లూరఁ, మై పులకరింప,
ముగుద! బెట్టిద మాక్రోధముద్ర విడిచి
ఏది తిలకింపు మొకసారి ఇతనివైపు.

పండువెన్నెలరే లిరుల్ ప్రాబ్బికొన్న
కాళరాత్రులయట్టులఁ గానుపించు,
అతివ! వలపులు జిలుక రసార్ద్రఫణితి
నొక్కమాటైన నీ వాడకున్కి జేసి.

నవశిరీషసుమోపమానమయి, నిండు
ప్రేమమునవైన వసివాడుహృదయ మబల!
ప్రియుని కక్కసపెట్టునీ బిరుదువలన
శీర్ణమైపోవు నిక నాలసించెదేని!

అలరుపొలతులమైపూత లంటుకొన్న
అంగకమ్ముల నలనల్ల నరుగుదెంచు
పిల్లతెమ్మెరకాని పింపిళ్లకేని
కరుగదా హృది? యెంత నిష్కరుణమయ్యె?

అదె శరన్మేఘుడోలెఁ దూఁగాడునమృత
మధురమూర్తియు రోహిణీమానపతికి
కలువపూగుత్తి నీనిశాకాంతచేతఁ
బంపు, ప్రేమోపదగ స్వీకరింపు మనుచు.

ప్రణయినీ! మృదుమధురభావాలబరిణె
హృదయ మెందులకే పిధానించుకొనెదు?
అందు విరిసినపూలభోగ్యత్వమునకు
కొదమతుమ్మెద తమి మూఁగికొనెడువేళ!